క్లుప్తంగా

ఘంటా ప్రసాద్‌కు అభినందనలు



ఘంటా ప్రసాదరావును సత్కరించిన గోపి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షునిగా రెండో సారి నియమితులైన ఘంటా ప్రసాదరావుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి గురువారం సంఘం తరఫున అభినందనలు తెలిపి, పూలమాలతో సత్కరించారు. ఇప్పటికే బీసీలకు ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

అలరించిన బుర్రకథ



బుర్రకథా గానం చేస్తున్న వీర్నాల పార్వతి బృందం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఏలూరుకు చెందిన పార్వతి బుర్రకథ బృందం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం అనే అంశంపై చేసిన బుర్రకథాగానం అలరించింది. ఉదయం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామకోటి పూజలు చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం గంటలకుహరిద్వార్ దాసభారతి ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ వాయుదేవుని వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

బాలుడి అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో బాలుడు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. 8వ తరగతి చదువుతోన్న తూర్పువీధి ప్రాంతానికి చెందిన ప్రసాదం నాగ తనుష్ గురువారం ఉదయం తల్లి రాజేశ్వరితో కలిసి ఇంటి సమీపంలోని సాయిబాబా గుడికి దర్శనానికి వెళ్లారు. తల్లి గుడి వద్ద ఉండగానే ఇంటికి వెళ్లిపోతానంటూ చెప్పి నాగ తనుష్ వచ్చేశాడు. ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వాకబుచేసినా ఆచూకీ దొరకలేదు. తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోమటిలంకకు దారి

- మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలు మంజూరు
- తూరల వంతెన ఏర్పాటుకు శ్రీకారం



కొల్లేరు నడిబొడ్డున ఉన్న కోమటిలంక గ్రామానికి వంతెన నిర్మించనున్న ప్రాంతం

ఏలూరు రూరల్ : కోమటిలంక ప్రజల కల సాకారం కాబోతోంది. కొల్లేరు నడిబొడ్డున జీవిస్తోన్న గ్రామ ప్రజలు రాకపోకలు సాగించేందుకు దారి ఏర్పడనుంది. ఇందుకోసం మండల పరిషత్ పాలకవర్గం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తంతో అధికారులు వంతెన నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఎన్నోఏళ్ల కల

ఏలూరు మండలం, దెందులూరు నియోజకవర్గానికి చెందిన కోమటిలంక గ్రామం కైకలూరుకు రెండు కిలో మీటర్ల దూరంలో ఉంది. గ్రామానికి మూడు పక్కల కొల్లేరు ఆవరించి ఉంది. గ్రామస్తులు పోల్రాజు డ్రెయినేజీ గుండా పడవపై కైకలూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. వరదలు, వర్షాకాలంలో డ్రెయిన్ పొంగి ప్రజలు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ హయాంలో ఓ గర్భిణి పడవలో డ్రెయినేజీ దాటలేక గర్భస్రావానికి గురయ్యింది. వర్షాకాలంలో పడవలో డ్రెయిన్ దాటుతుండగా బడి పిల్లలు కొల్లేరులో కొట్టుకుపోయారు. రోడ్డు, వంతెన వేయాలంటూ గ్రామస్తులు ఆందోళన చేసినప్పటికీ నాటి పాలకులు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర క్రితం అధికారులు రూ.10 లక్షలతో రోడ్డును అభివృద్ధి చేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు వంతెన వేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని కోరారు. వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నేడు అటవీ చట్టం నిబంధనలు అనుసరించి సిమెంట్, ఐరన్ భారీ తూరలతో కూడిన వంతెన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు.

అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కోమటిలంక అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు వేశారు. ఇప్పుడు ప్రజలు రాకపోలు సాగించేందుకు వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే ఆదేశానుసారం మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు కేటాయిస్తున్నాం. రాజకీయాలకు తావులేని అభివృద్ధి చేసి చూపాలన్నదే ఎమ్మెల్యే ఆకాంక్ష. ఎంత ఖర్చు అయినా పని వంతెన పూర్తి చేస్తాం.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

గతంలో పోలీసు కేసులు పెట్టారు



ఎన్నోఏళ్లుగా మా గ్రామానికి వంతెన లేక ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రోడ్డు వేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే రోడ్డు వేయాలని ప్రజలు ఆందోళన చేస్తే గ్రామస్తులపై పోలీసు కేసులు పెట్టారు. ఇప్పుడు త్వరలో నేరుగా గ్రామానికే రాకపోకలు సాగించేందుకు వంతెన పనులు చేపడుతున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– తెనాలి యోహాన్, సర్పంచ్

పూర్వ విద్యార్థుల బైక్ ర్యాలీ



ఏలూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సుబ్బమ్మ దేవి స్కూల్ పూర్వ విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాల 75 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకల ప్రారంభ సూచికగా గురువారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 బైక్‌లతో పాఠశాల వద్ద నుంచి అశోక్ స్తంభం, ఫైర్ స్టేషన్, పాత బస్టాండు, ఏఎస్ఆర్ స్టేడియం, ఏఆర్‌డీజీకే హైస్కూల్, గంగానమ్మ గుడి, 12 పంపుల సెంటర్ మీదుగా పవరుపేట రైల్వే స్టేషన్, ఆర్ఆర్‌పేట, జీవీ మాల్, పత్తేబాద, తంగెళ్లమూడి ప్రాంతాల మీదుగా తిరిగి పాఠశాల వద్దకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వి.రత్నకుమార్, కోశాధికారి బీసీఆర్ మోహన్, పూర్వ విద్యార్థులు డి.ఈశ్వర్, రెడ్డి ప్రసాద్, జి.సూర్యనారాయణ, తోట శివ, కె.కృష్ణమాచార్యులు, వి.రత్నకిషోర్, పీపీ శాస్త్రి, మజ్జి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలి



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి కిషోర్

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలని, రద్దు చేసిన 40 స్పెషలిస్టు వైద్య పోస్టులు, 350 బెడ్స్‌ను పునరుద్ధరించాలని, ఏలూరు, దెందులూరు, కైకలూరులలో మూడు ఏరియా ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన గురువారం పార్టీ నాయకులు విలేకర్లతో మాట్లాడారు. ఏలూరుకు మెడికల్ కాలేజ్ రావడం ఆనందించ దగ్గ విషయమని, ఐతే పాత ఆసుపత్రిలోనే మెడికల్ కాలేజీను ప్రారంభించడం వల్ల ఇప్పటి వరకు వైద్య సేవలు అందిస్తున్న 40 స్పెషలిస్టు వైద్య పోస్టులు, 150కు పైగా మెడికల్ సిబ్బంది పోస్టులు, 350 బెడ్స్ రద్దు అయ్యాయన్నారు. జిల్లా ఆసుపత్రిలో ప్రతి రోజు ఓపీ 1200, సోమవారం వంటి రోజుల్లో 1800 వరకు ఉంటుందని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 18 లక్షలు జనాభాకు భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయన్నారు. ఏలూరు జిల్లాలోని 21 లక్షల జనాభాకు నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడిల్లోనే ఏరియా ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో నాయకులు బి.సోమయ్య, జి.రవికిషోర్,వైఎస్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

జనన, మరణ, వివాహాల
నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): జనన, మరణ, వివాహాలను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాసదన్ భవన్‌లో గ్రామ, మండల, మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయ సంబంధిత అధికారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జనన, మరణ, వివాహ నమోదుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సచివాలయం లేదా రిజిస్టర్ ఆఫీస్ లేదా మున్సిపల్ ఆఫీస్‌లలో జనన నమోదు, వివాహ నమోదు సంబంధిత ఆఫీసుల్లో చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మునేశ్వరరావు, జాయింట్ రిజిస్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డీఎల్‌పీలో టి.అన్నామణి, ప్యానెల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రత్తిపాటి తంబి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక, కృషితోనే పోటీ పరీక్షల్లో విజయం



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ప్రణాళిక, పట్టుదల, కృషితోనే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి దూలం కిషోర్ అన్నారు. గురువారం ఏలూరు సీఆర్ఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఎస్‌వైకే ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యువత సమస్యలను అధిగమించాలని సూచించారు. కళాశాల సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ చేసుకోవాలన్నారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.మధుసూదనరావు మాట్లాడుతూ యువత విద్యతో పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరరాజ్, కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, విష్ణుమోహన్, పీజీ కోర్సు డైరక్టర్ కొండయ్య, అభినయ నృత్యభారతి నిర్వాహకుడు హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘాలకు చెరువులను కేటాయించాలి



మహాసభలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజక సంఘాలకు గ్రామాల్లో చెరువులను కేటాయించి, లీజుకు ఇవ్వాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. జిల్లా రజక జన సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక జిల్లా కార్యాలయంలో గోల్డెన్ జూబ్లీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కట్లయ్య మాట్లాడుతూ డీపీఓ ఆదేశాల ప్రకారం గ్రామ రజక సంఘాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ తప్పక చేయించుకొని చెరువులను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా రజకుల సంక్షేమానికి పలు తీర్మానాలను ఆమోదించారు. తొలుత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోరంగి అప్పారావు, బుద్దారపు గోపిరాజు,కట్టుంగ కొండలరావు, విఠల శ్రీహరి, గోవాడ కాసి, కుమ్మరికుంట నాగన్నల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న సురేష్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీహరికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పవర్‌పేట అంగన్‌వాడీ సెంటర్, నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల విద్యార్థులను పలు ప్రశ్నలు వేయగా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. పాఠశాలలో తరగతి గదుల తాళాలు తీయించగా అవి అపరిశుభ్రంగా కనిపించాయి. దీంతో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పాఠశాలలోని వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్ఈఓ ఎన్‌వీ రవిసాగర్, ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి తదితరులున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెదపాడు: మండలంలోని ఏపూరులో అభయాంజనేయస్వామి 8వ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపూరులోని ఏలేటైవర సమీపంలో ఉన్న శ్రీ సీతారామ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న 45అడుగుల అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యన్నారాయణ, చోడే వెంకయ్య కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భజనలు హనుమాన్ చాలీసా పారాయణ చేసారు.

తూతూ మంత్రంగా ఎన్నికల కోడ్ అమలు

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దెందులూరు మండలంలో తూతూ మంత్రంగా అమలు జరుగుతుంది. అధికారులు, గ్రామ స్థాయి ఉద్యోగులు ఎన్నికల కోడ్ అమలును ఏ మాత్రం పట్టించుకోవడం లేదనడానికి గాలాయగూడెం, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో రోడ్డు పక్కనే ఉన్న వివిధ రాజకీయ పార్టీల జెండాలు నిదర్శనం. గాలాయగూడెం గ్రామంలో సచివాలయం పక్కనే మూడు తెలుగుదేశం పార్టీ జెండాలున్నాయి. అక్కిరెడ్డిగూడెం స్కూల్ ఎదుట బీజేపీ జెండా ఉంది. గ్రామస్థాయి, మండల అధికారులు పట్టించుకోకపోవడంతో టీడీపీ, బీజేపీ జెండాలు తొలగించడం లేదని, గ్రామగ్రామాన దెందులూరు మండల వ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు సైతం ఆదేశాలు జారీ చేయడం, సమీక్షలు, సమావేశాలు నిర్వహించడమే తప్ప, ఎన్నికల కోడ్ అమలును ఎక్కడ పర్యవేక్షిస్తున్నారని, ఎన్నికల కోడ్ ఇలాగేనా అమలు పరిచేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	12-15
బెండకాయలు	40	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	32
కాకర కాయలు	30-36	కీరా దోస	30
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	32	పాలకూర	08
దొండకాయలు	32	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	18	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	42-48	బఠాణీ	56
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

పరివర్తన పాఠశాలకు ప్రథమం



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

ఏలూరు రూరల్ : రాష్ట్ర స్థాయి క్విజేబుల్ పోటీల్లో దొండపాడు పరివర్తన బధిరుల పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కాకినాడ స్మార్ట్ సిటీ ఫంక్షన్ హాల్లో బెంగుళూరు సేవ ఇన్ యాక్షన్, కాకినాడ ఉమా ఎడ్యుకేషనల్ సంయుక్తంగా నిర్వహించిన పలు పోటీల్లో పరివర్తన బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. టి.దినేష్‌కుమార్, ఎ.కౌషిక్ ప్రథమ స్థానంలో నిలవగా నిర్వాహకులు రూ.10 వేలు అందజేశారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక విద్యా నగర్,శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల మార్పులు, చెట్ల కొమ్మలు తలగింపు వంటి పనుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా నగర్, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

28న చేనేత కార్మికుల ఆందోళన

ఏలూరు (టూటౌన్): బడ్జెట్లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈ నెల 28న జిల్లాలోని సచివాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు ఏపీ చేనేత కార్మికక సంఘం జిల్లా అధ్యక్షులు కాసా రత్న కుమార్, జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషులు తెలిపారు. పవరుపేటలోని సంఘం కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక గుర్తింపు

ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ నవీన్‌బాబు



లింగపాలెం: బీసీలను గుర్తించి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది జగనన్న ప్రభుత్వమేనని ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు అన్నారు. గురువారం ఆయన భోగోలులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, ఆయా వర్గాల అభ్యున్నతి ఆయనతోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించారన్నారు. 18 శాసన మండలి స్థానాల్లో బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1 చొప్పున మొత్తం 14 మందికి అవకాశం కల్పించడం అనేది భారతదేశంలోనే చారిత్రాత్మకమైన నిర్ణయమని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బీసీలకు అధిక ప్రాధ్యాన్యత ఇస్తూ బీసీల విప్లవం తీసుకువస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వ్యక్తి సీఎం జగన్ అన్నారు. గతంలో రాజ్యసభ సీట్లలో 50 శాతం బీసీలకు కేటాయించడం, తాజాగా ఎమ్మెల్సీ స్థానాల్లో 61 శాతం బీసీలకు ఇవ్వడం ద్వారా సీఎం సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత మంది బీసీలను శాసన మండలికి పంపడం ఇదే తొలిసారి అన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 11 మందికి, రాజ్యసభలో నలుగురికి, లోక్‌సభలో ఆరుగురికి, శాసనసభ్యులుగా 21 మంది బీసీ నేతలు ఉన్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చి మాటతప్పని మడమతిప్పని వ్యక్తిగా సీఎం జగన్ మోహనరెడ్డి నిలిచారని నవీన్‌బాబు పేర్కొన్నారు.

శరవేగంగా చెక్‌డ్యాం పనులు



దెందులూరు సైఫన్ వద్ద నిర్వహిస్తున్న చెక్‌డ్యాం పనులు

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో మంజూరైన రూ. 9.50 లక్షలతో చెక్‌డ్యామ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. గురువారం చెక్‌డ్యాం పనులను పరిశీలించిన అనంతరం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, దెందులూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ అమ్మవారి ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం కాల్వ నుంచి వచ్చే నీటిని చెక్‌డ్యాం ద్వారా దెందులూరు మండలం సీతంపేట కాల్వకు నీటిని నేరుగా సరఫరా చేయడం ఈ చెక్‌డ్యాం నిర్మాణం ప్రధాన లక్ష్యమన్నారు. దెందులూరు, అలుగులగూడెం, సత్యనారాయణపురం, దోసపాడు, కొమరేపల్లి, సీతంపేట గ్రామాల్లోని 4832 ఎకరాలకు పోలవరం కాల్వ నీటిని అందించడం జరుగుతుందన్నారు. 6 గ్రామాల్లోని 4700 ఎకరాల సాగుకు రూ. 9.50 లక్షలు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, కొలుసు గణపతిరావు, పోకల రాంబాబు, తొత్తడి వేదకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.